క్లుప్తంగా

హస్తం గుర్తుకు ఓటు వేయండి



చౌదరిగూడలో ఇంటింటి ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కొందుర్గు: కాంగ్రెస్‌కి ఓటువేసి గెలిపించాలని జిల్లేడ్ చౌదరిగూడ మండల కమిటీ అధ్యక్షుడు కావలి రాజు సూచించారు. శనివారం చౌదరిగూడలో కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలను ఖచ్చితంగా అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, చంద్రబాబు, రజిత, సత్యనారాయణ రెడ్డి, బాల్‌రాజ్, గోపాల్, రవికుమార్ పాల్గొన్నారు.

అందె బాబయ్యను గెలిపించండి

బీజేపీ నేత చెట్ల వెంకటేశ్



ప్రచారం చేస్తున్న అందె కిష్టమ్మ

షాద్‌నగర్‌రూరల్: బీజేపీని గెలిపించి అభివృద్ధికి బాటలు వేయాలని నేత చెట్ల వెంకటేశ్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని తొమ్మిదోవ వార్డులో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా కరపత్రాలను అందజేస్తూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పథకాలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిరుపేదల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను చేపట్టిందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి అందెబాబయ్యను అత్యధిక మెజార్టీతో గెలిపించి అభివృద్ధికి నాంది పలకాలన్నారు. ఈ కార్యక్రమంలో శేరివిష్ణువర్ధన్‌రెడ్డి, వంశీకృష్ణ, మల్చలం మురళీ, ప్యాట అశోక్, రాము, భూషణ్, కాసోజు శివ, సందీప్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

అందెబాబయ్యకు మద్దతుగా ప్రచారం

బీజేపీ అభ్యర్థి అందెబాబయ్యకు మద్దతుగా పట్టణంలోని తొమ్మిదో వార్డులో శనివారం ఇంటింటి ప్రచారం చేశారు. బీజేపీ అభ్యర్థి అందెబాబయ్య సతీమణి అందెకిష్టమ్మ ఇంటింటికి వెళ్లి భర్తకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తూ అందెబాబయ్యకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కుండి దయాకర్



దయాకర్‌ను నియమించి కండువా కప్పుతున్న రవూఫ్

మొయినాబాద్: మండల పరిధిలోని ఎలుకగూడ గ్రామానికి చెందిన కుండి దయాకర్‌ను బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా శనివారం నియమించారు. ఏఎంసీ వైస్ చైర్మన్ రవూఫ్ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి, బీఆర్‌ఎస్ గెలుపునకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎలుకగూడ సర్పంచ్ ఆలూరి కుమార్, మండల ఉపాధ్యక్షుడు జయవంత్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు సమన్యాయం



వెంకన్న గూడ గ్రామంలో మాట్లాడుతున్న భీంభరత్

చేవెళ్ల: కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే అభ్యర్థి పామెన భీంభరత్ అన్నారు. చేవెళ్ల మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పలు గ్రామాల నుంచి ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పార్టీలో చేరారు. వారికి భీంభరత్, శ్రీకాంత్‌రెడ్డి, డీవీఆర్, అగిరెడ్డి, వీరేందర్‌రెడ్డిలు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. చేవెళ్లకు చెందిన బీజేపీ నాయకుడు మహిపాల్‌రెడ్డి, మల్కాపూర్ గ్రామానికి చెందిన చామంతి జంగయ్య, బి. ప్రభాకర్‌రెడ్డి, శివ, మురళీ, భాస్కర్, విజయ్, దినేశ్, ప్రభాకర్‌రెడ్డి, భరత్, కిషోర్, శ్రీనాథ్ తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణరెడ్డి, వసంతం, నరేందర్‌చారి తదితరులు పాల్గొన్నారు.

ఆనందాల దీపావళి

విజయానికి చిహ్నం

- నోములు నోచుకోవడం ప్రత్యేకం
- ప్రతి ఇంట్లో లక్ష్మీపూజ, దీపాలంకరణలు
- కొత్త పద్దులు ప్రారంభించడానికి వ్యాపారుల ఆసక్తి



టపాసులు అమ్ముతున్న వ్యాపారులు



అమ్మకానికి సిద్ధంగా ఉన్న టపాసులు

షాబాద్: ఆనందాల తళుకులు..దీపాల వెలుగులు ఇది పర్వదినానికి సంకేతం. చెడుపై మంచి సాధించిన విజయానికి చిహ్నంగా ఈ పండుగను ఇంటిల్లాపాది జరుపుకొంటారు. లక్ష్మీదేవికి దీపారాధన చేయడంతో సకల చీడ, పీడ తొలగి సంతోషం, సౌభాగ్యం కలుగుతుందని ప్రతీతి. ప్రతీ పనిలో విజయం, సత్ఫలితాలనిస్తాయని భక్తుల నమ్మకం. దేశంలో హిందువులు, సిక్కులు, జైనులు అతిపెద్దగా దీన్ని జరుపుకుంటారు.

లక్ష్మీదేవికి పూజలు..

హిందువుల ముఖ్యమైన పండుగల్లో ఇదీ ఒకటి. అశ్వయుజ అమావాస్య రోజు దీపావళి జరుపుకుంటారు. అంతకు ముందు రోజు నరకాసుర వధ జరిగిన రోజును వ్యాపారులు నూతన సంవత్సరంగా భావిస్తారు. లక్ష్మీదేవికి పూజలు చేసిన అనంతరం నూతన ఖాతా పుస్తకాలతో కొత్త పద్దులను ప్రారంభిస్తారు. ఈ పండుగ రోజునా శ్రీలక్ష్మీమహాగణపతి పూజలు నిర్వహిస్తారు.

సౌభాగ్యంగా ఉండాలని..

దీపావళి నుంచి కార్తీక పౌర్ణమి వరకు లక్ష్మీదేవి అనుగ్రహం కోసం ప్రజలు నోములు నోచుకుంటారు. ఇందులో స్త్రీలు తమ సౌభాగ్యంగా ఉండాలని అమ్మవారిని పూజిస్తారు. ఇప్పటికీ కొన్ని కుటుంబాల్లో ఇది వంశపారపర్యంగా వస్తోంది. ఉదయం నుంచి ఉపవాసం నిర్వహిస్తారు. అమ్మవారి పూజ అనంతరం నైవేద్యం పెట్టి ప్రసాదాలను స్వీకరిస్తారు. నోము నోచుకున్న రోజు స్త్రీలకు వాయినాలు ఇస్తారు.



అమ్మకానికి దొంతులు, దీపాంతలు

కొత్త అల్లుళ్లతో సందడి..

నూతన మధూవరులకు ఈ పండగ కొత్త అనుభూతినిస్తోంది. అత్తారింటికి వచ్చిన అల్లుళ్లకు ఆ ఇండ్లలో సందడి వాతావరణం ఉంటోంది. నూతన దంపతులకు ఒడి బియ్యం పోసి, నూతన వస్త్రాలను అందజేస్తారు. తమ అమ్మాయికి బంగారాన్ని కానుకగా ఇస్తారు. అల్లుడికి మంచి అతిథ్యంతో సంతోషంగా ఉండేవిధంగా చూసుకుంటారు.

నూతన వస్తువుల కొనుగోలు...

దీపావళి రోజు ఏది కొనుగోలు చేసినా లక్ష్మీదేవి ఇంటికి వస్తుందని ప్రజల నమ్మకం. అందుకే ఈ రోజు ఏదో ఒకటి నూతన వస్తువులను ఇంటికి తీసుకొస్తారు. ముఖ్యంగా లక్ష్మీదేవిని బంగారంతో పూజిస్తారు. అందుకే బంగారం, బంగారు ఆభరణాలు ఖరీదు చేయడానికి ఆసక్తి చూపుతారు. ద్విచక్ర వాహనాలు, దుస్తులు, గృహోపకరణాలకు సంబంధించి శుభం జరగాలని ఇంటికి తీసుకొస్తారు. చిన్న పిల్లలకు బంగారు ఆభరణాలు వేస్తారు.

పిండి వంటకాల గుమగుమలు...

దీపావళి రోజు పిండి వంటకాలకు ప్రత్యేకత ఉంటుంది. ముఖ్యంగా పాయసం, బెల్లంతో చేసే బూరెలు ఈ పండుగకు ముఖ్య వంటకాలు. వీటితో పాటు పులిహోర, లడ్డులు మొదలైనవి ఇంట్లో తయాచేస్తారు. కుటుంబం సభ్యులంతా కలసి సంతోషంగా లక్ష్మీదేవికి ప్రసాదాలను పెట్టి వాటిని స్వీకరిస్తారు. ముఖ్యంగా వర్షకాలం ముగిసి శీతా కాలం ప్రారంభ దశలో ఈ వంటకాలు ఆరోగ్యానికి మేలు చేస్తాయి.

బాణా సంచాతో జాగ్రత్త...

- భారీ టపాసులను పిల్లలచేతికి ఇవ్వకూడదు.
- పెద్దల పర్యవేక్షణలో టపాసులు కాల్చేలా చూడాలి
- కాటన్ దుస్తులు, వదులుగా ఉన్నవి ధరించి టపాసులు కాల్చుకోవాలి.
- చిచ్చుబుడ్లు కాల్చే సమయంలో నిప్పులు ఒంటిపైకి పడకుండా దూరంగా ఉండి కాల్చాలి.
- కాళ్లకు చెప్పులు తప్పనిసరిగా ధరించాలి.
- ఆరుబయట కాల్చేలా చర్యలు తీసుకోవాలి.
- పేలని టపాసులను మళ్లీ, మళ్లీ కాల్చే ప్రయత్నం చేయొద్దు.
- అందులో ఉండే పౌడర్‌ను తీసి పేపర్, కవర్లపై కాల్చే ప్రయత్నం చాలా ప్రమాద కరం. అలాంటి ప్రయత్నం అసలే చేయొద్దు.
- రాకెట్‌ను పేల్చే సమయంలో నిటారుగా ఆకాశం వైపు ఎగిరేలా చూసుకోవాలి. లేదంటే అవి మన మీదకు, పక్కింటికి దూసుకొచ్చే ప్రమాదం ఉంది.
- పెద్ద పెద్ద శబ్దాలవల్ల ధ్వని కాలుష్యానికి గురికాకుండా చెవుల్లో దూది పెట్టుకోవాలి.
- బాణా సంచాలను కేవలం లైసెన్సు కలిగిన దుకాణాల్లోనే కొనుగోలు చేయాలి.
- బాణా సంచా ఇంట్లో పెట్టుకునేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. వంటగదిలో వెలిగే దీపాల వద్ద టపాసులు పెట్టొద్దు.

భద్రతా ప్రమాణాలు పాటించాలి



దీపావళి సందర్భంగా టపాసులు అమ్మే దుకాణ యజమానులు భద్రతా ప్రమాణాలు పాటించాలని సీఐ యాదయ్యగౌడ్ పేర్కొన్నారు. శనివారం షాబాద్ పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. క్రాకర్స్ స్టాల్స్ ఏర్పాటు చేసిన దుకాణ నిర్వాహకులు ప్రతీ దుకాణం ముందు ఇసుక బకెట్‌లు, వాటర్ డ్రమ్ము, ఫైర్ సేఫ్టీ సిలిండర్ పెట్టుకోవాలని సూచించారు.

– సీఐ యాదయ్యగౌడ్

అప్పుడు చేయలేదు.. ఇప్పుడెలా చేస్తారు?

- బీఆర్‌ఎస్ చేవెళ్ల ఎమ్మెల్యే అభ్యర్థి కాలె యాదయ్య
- కాంగ్రెస్, బీజేపీలను నమ్మరు



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న కాలె యాదయ్య

చేవెళ్ల: ఏళ్ల తరబడి అధికారంలోఉన్న పార్టీలు చేయలేని అభివృద్ధి పనులు ఇప్పుడు ఎలా చేస్తారని బీఆర్‌ఎస్ చేవెళ్ల ఎమ్మెల్యే అభ్యర్థి కాలె యాదయ్య ప్రశ్నించారు. ఆలూరు, మీర్జాగూడ, బస్తేపూర్ గ్రామంలో శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మరోసారి కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. ఈ ఎన్నికల్లో గెలవాలని కాంగ్రెస్, బీజేపీ ఇచ్చే హామీలను నమ్మొదన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత కేసీఆర్ నాయకత్వంలో గ్రామాలు, రాష్ట్రం అభివృద్ధి చెందాయని గుర్తుచేశారు. తమకు మరోసారి అవకాశం కల్పిస్తే మరింత అభివృద్ధి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలూరు సర్పంచ్ విజయలక్ష్మి, మీర్జాగూడ సర్పంచ్ భీమయ్య, బస్తేపూర్ సర్పంచ్ నర్సింలు, ఉప సర్పంచ్ కసిరే వెంకటేశ్, ఎంపీటీసీ యాదమ్మ, యూత్ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్, జెడ్పీటీసీ ఎం. మాలతి, వైస్ ఎంపీపీ శివప్రసాద్, మాజీ ఎంపీపీ ఎం. బాల్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు మార్పు కోరుకుంటున్నారు

- చేవెళ్ల అసెంబ్లీ బీఎస్పీ అభ్యర్థి రాజమహేంద్రవర్మ



రాజమహేంద్రవర్మను సన్మానిస్తున్న నాయకులు

మొయినాబాద్‌రూరల్: ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని చేవెళ్ల బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి రాజమహేంద్రవర్మ అన్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్‌లో బీఎస్పీ నాయకులు, మండల ఉపాధ్యక్షుడు విక్రమ్‌రాయ్ నాయకులతో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవర్మ మాట్లాడుతూ గెలుపే లక్ష్యంగా గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించాలన్నారు. ఏనుగు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రచారంలో వారు ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మండల ఎగ్జిక్యూటివ్ మెంబర్ నరసింహయాదవ్, మండల కార్యదర్శి అజయ్‌కుమార్, హిమాయత్‌నగర్ అధ్యక్షుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ పాలన నుంచి విముక్తి కల్పించాలి

పీసీసీ రాష్ట్ర కార్యదర్శి పీసరి సురేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్



సీతారాంపూర్‌లో ఎన్నికల ప్రచారంలో పీసరి సురేందర్‌రెడ్డి, కావలి చంద్రశేఖర్

షాబాద్: జూటా మాటలతో గద్దెనెక్కుతూ, ప్రజలను మోసం చేస్తున్న కల్వకుంట్ల కుటుంబ పాలన నుంచి రాష్ట్రానికి విముక్తి కల్పించాలని పీసీసీ రాష్ట్ర కార్యదర్శి పీసరి సురేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్ పేర్కొన్నారు. శనివారం రాత్రి షాబాద్ మండల పరిధిలోని సీతారాంపూర్ గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌కి ప్రజలు పట్టం కట్టడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.500లకు గ్యాస్ సిలిండర్, ఉచితంగా ఆర్టీసీలో ప్రయాణం, రైతుబంధు కింద ఎకరానికి రూ.16 వేలు, కౌలు రైతులకు రూ.12 వేలు వంటి పథకాలను అమలు చేస్తామన్నారు. గడిచిన తొమ్మిదేళ్ల కాలంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదలకు చేసిందేమి లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు కుమ్మరి చెన్నయ్య, అశోక్, రవీందర్, పామెన నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

రానున్నది బీజేపీ ప్రభుత్వమే

ఎమ్మెల్యే అభ్యర్థి కేఎస్ రత్నం సతీమణి ప్రమీల, కూతురు డాక్టర్ ప్రణీత



షాబాద్: ఓటు అభ్యర్థిస్తున్న కేఎస్ రత్నం సతీమణి ప్రమీల, కూతురు డాక్టర్ ప్రణీత



మొయినాబాద్: పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేంద్ర మంత్రి బీఎల్ శర్మ

షాబాద్: రాష్ట్రంలో రాన్నునది బీజేపీ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే అభ్యర్థి కేఎస్ రత్నం సతీమణి ప్రమీల, కూతురు డాక్టర్ ప్రణీత అన్నారు. శనివారం నాగర్‌గూడ, ఆస్పల్లిగూడ, చర్లగూడ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌తో రైతులకు ఎలాంటి లాభం జరగలేదన్నారు. రాజకీయంగా ఎదుర్కొనే దమ్ము లేక కొందరు తన భర్తపై తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక పోతున్నారని మండిపడ్డారు. చేవెళ్లలో బీజేపీ విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరని, కార్యకర్తలు, నాయకులు గెలుపు కోసం పని చేయాలని వారు సూచించారు. ఏ సమస్య వచ్చినా తాము అండగా ఉంటామని వారికి భరోసా ఇచ్చారు. చేవెళ్ల గడ్డపై కాషాయ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కిరణ్, క్యామ నారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీధర్‌రెడ్డి, బీజేవైఎం స్వచ్ఛ భారత్ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాము, మాణెయ్య, మహేశ్, కూతరు మహేందర్, శ్రీశైలం, నవీన్, గోవర్ధన్, విష్ణు, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

మొయినాబాద్: చిలుకూరు మాజీ ఎంపీటీసీ సభ్యుడు మంగలి పెంటయ్య బీఆర్‌ఎస్ నుంచి బీజేపీలో చేరారు. చేవెళ్ల అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం ఆధ్వర్యంలో కేంద్ర మంత్రి బీఎల్ శర్మ, మాజీ ఎంపీటీసీ సభ్యుడు మంగలి పెంటయ్యకు కాషాయ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహ్మారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాశ్, మండల మాజీ అధ్యక్షుడు గున్నాల గోపాల్‌రెడ్డి, నర్సింహ్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌తోనే రాష్ట్ర అభివృద్ధి

బీఆర్‌ఎస్ చేవెళ్ల నియోజకవర్గం ఎన్నికల ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి



యువ సమ్మేళనంలో మాట్లాడుతున్న కార్తీక్‌రెడ్డి

శంకర్‌పల్లి: సీఎం కేసీఆర్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని బీఆర్‌ఎస్ చేవెళ్ల నియోజకవర్గం ఎన్నికల ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి కాలె యాదయ్యకు మద్దతుగా శంకర్‌పల్లి మండల, మున్సిపల్ బీఆర్‌ఎస్ యువజన విభాగాల ఆధ్వర్యంలో యువ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. పార్టీలకు అతీతంగా ప్రతీ ఇంటికి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే చేవెళ్ల నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. అనంతరం ఎమ్మెల్యే అభ్యర్థి కాలె యాదయ్య మాట్లాడుతూ నియోజకవర్గం అభివృద్ధికి తను నిరంతరం కృషి చేస్తునట్లు చెప్పారు. సీఎం కేసీఆర్ చేవెళ్ల నియోజకవర్గానికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేశారన్నారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను బూత్ స్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో శంకర్‌పల్లి ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ గోవిందమ్మ, చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి, వైస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, మున్సిపల్ యువజన విభాగం అధ్యక్షుడు పాండురంగారెడ్డి, మండల యువజన విభాగం అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, ఏఎంసీ చైర్మన్ పాపారావు, వైస్ చైర్మన కురుమ వెంకటేశ్, పీఏసీఎస్ చైర్మన్ బద్దం శశిధర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు గోపాల్, మున్సిపల్ అధ్యక్షుడు వాహెదేవ్‌ఖన్నా, గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దక్కారే.. దక్కా హ్యాట్రిక్ పక్కా

సీడీ ఆవిష్కరించిన మంత్రి కేటీఆర్



సీడీ ఆవిష్కరిస్తున్న మంత్రి కేటీఆర్

శంకర్‌పల్లి: శంకర్‌పల్లి ఎంపీపీ ధర్మన్నగారి గోవర్ధన్ రెడ్డి పాడించిన దక్కారే..దక్కా హ్యాట్రిక్ పక్కా పాటల సీడీని శనివారం నగరంలోని ప్రగతి భవన్‌లో మంత్రి కేటీఆర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో శంకర్‌పల్లి ఎంపీపీ ధన్మన్నగారి గోవర్ధన్‌రెడ్డి, యువజన నాయకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే సమన్యాయం

షాద్‌నగర్ రూరల్: బీఆర్‌ఎస్‌తోనే ప్రజలకు సమన్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే అంజయ్యాయాదవ్ అన్నారు. శనివారం మాజీ వైస్ ఎంపీపీ బసిరెడ్డి నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కంసాన్‌పల్లి గ్రామానికి చెందిన మైనార్టీలు అంజయ్యాయాదవ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. లింగారెడ్డిగూడకు చెందిన వివిధ పార్టీ నాయకులు సర్పంచ్ భీష్యమాధవిరామకృష్ణ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బెంది శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షుడు భీష్వరామకృష్ణ, గ్రామ కమిటీ అధ్యక్షుడు గోద లక్ష్మయ్యాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల పరిశీలకులుగా జనార్దన్ శిల్పాశర్మ

చేవెళ్ల: చేవెళ్ల అసెంబ్లీకి సంబంధించి ఇద్దరు ఐఆర్‌ఎస్, ఐఏఎస్ అధికారులను ఎన్నికల పరిశీలకులుగా ఎన్నికల సంఘం నియమించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి సాయిరాం తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గానికి ఐఆర్‌ఎస్ అధికారి జనార్దన్ (ఫోన్ నెంబర్ 9030162777), సాధారణ ఎన్నికల పరిశీలకులుగా ఐఏఎస్ అధికారి శిల్పాశర్మ (ఫోన్ నెంబర్ 9030181777)లను నియమించినట్లు చెప్పారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

- అవినీతి ప్రభుత్వాన్ని సాగనంపుదాం
- మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి
- బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరికలు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి

నందిగామ: కాంగ్రెస్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మామిడిపల్లిలో శనివారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వీర్లపల్లి శంకర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. బీఆర్‌ఎస్ తొమ్మిదేళ్ల పాలనలో ఏ ఒక్క హామీ నెరవేర్చలేదన్నారు. అవినీతి బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని సాగనంపే సమయం ఆసన్నమైందన్నారు. అనంతరం వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ కాంగ్రెస్‌కి ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించినట్లయితే మామిడిపల్లి రుణం తీర్చుకుంటానన్నారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేసి నిరుపేదలను ఆదుకుంటామని చెప్పారు.

బీఆర్‌ఎస్ నుంచి చేరికలు..

గుడిమామిడిపల్లి, మజీద్ మామిడిపల్లి తదితర గ్రామాలకు చెందిన సుమారు 150 మంది బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి ప్రతాప్ రెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మామిడి శ్యాంసుందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ శివ శంకర్ గౌడ్, జంగ నర్సింహా, నవీన్‌గౌడ్, సుదర్శన్ గౌడ్, గడ్డం శ్రీనివాస్ యాదవ్, కృష్ణయ్య, సిద్ధార్థ రెడ్డి, ఎంపీటీసీలు కొమ్ము కృష్ణ, చంద్రపాల్ రెడ్డి, మేకగూడ సర్పంచ్ పాండురంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్: కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలతో నిరుపేదలకు ఎంతో మేలు జరుగుతుందని మాజీ ఎంపీటీసీ వాడాల్యనర్సింహ్మారెడ్డి అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని వెల్జర్ల గ్రామంలో ఇంటింటి ప్రచారరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ కాంగ్రెస్ మేనిఫెస్టోను కాపీ కొట్టారని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకివస్తే పేదలకు మేలు జరుగుతుందన్నారు.

అభివృద్ధి పనులే గెలిపిస్తాయి



కొత్తూరు: పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీపీ రవీందర్‌యాదవ్



చౌదరిగూడలో ఇంటింటి ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కొందుర్గు: గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులే బీఆర్‌ఎస్ పార్టీని గెలిపిస్తాయని జిల్లేడ్ చౌదరిగూడ మండలం జెడ్పీటీసీ బంగారు స్వరూప అన్నారు. శనివారం చౌదరిగూడలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంజయ్యయాదవ్ కృషితోనే ప్రతీపల్లెకు బీటీరోడ్లు వేయించారన్నారు. మరోసారి కారు గుర్తుకు ఓటు వేసి అంజయ్యయాదవ్‌ను గెలిపించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ అధ్యక్షుడు సయ్యద్ హఫీజ్, సుధాకర్ రావు, జబ్బార్ పాల్గొన్నారు.

కొత్తూరులో..

కొత్తూరు: అభివృద్ధిపై నమ్మకంతోనే యువత, ఇతర పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌లోకి చేరుతున్నారని కేశంపేట ఎంపీపీ రవీందర్‌యాదవ్ అన్నారు. శనివారం కొత్తూరు మున్సిపాలిటీకి చెందిన పలువురు యువకులు ఆయన సమక్షంలో పార్టీలో చేరారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకోవడం గర్వకారణమన్నారు. కాంగ్రెస్ పాలనలో షాద్‌నగర్ నియోజకవర్గంలో ఎక్కడా అభివృద్ధి జరగలేదన్నారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ నియోజకవర్గ అభివృద్ధి కోసం వేల కోట్ల నిధులు మంజూరు చేయించారన్నారు. ఈ కార్యక్రమంలో దేవేందర్‌యాదవ్, కోస్గి శ్రీనివాస్, కార్తీక్, మహేశ్, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.